క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ హనుమాన్ నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. 11కేవీ భగత్‌సింగ్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



ఆలయ నూతన కమిటీ నూతన సభ్యులు

మీర్‌పేట: మీర్‌పేట గ్రామంలోని శ్రీ నల్లపోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పల్లె పాండుగౌడ్, వైస్ చైర్మన్‌గా కీసర గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గుమ్మాల వెంకటేష్, పెండ్యాల సంతోష్, సంయుక్త కార్యదర్శిగా ఉయ్యాల మాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పల్లె అరవింద్‌గౌడ్, కోశాధికారిగా పెండ్యాల సత్యనారాయణ, సభ్యులుగా పల్లె జంగయ్య గౌడ్, హనుమంత రావు, ఎరుకల రాజు, రుద్రమోని యాదగిరి యాదవ్ ఎన్నికయ్యారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు, సర్పంచ్

కందుకూరు: మండలంలోని ఆకులమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థి వేల్పుల పూజకు గ్రోతి ఈశ్వర ట్రస్ట్ చైర్మన్ జీవీఎస్ పవన్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు ఉషాబాల, సర్పంచ్ జి. కలమ్మరాజు, హెచ్‌ఎం శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు పి.తిరుపతిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, అల్లం తిరుమల వీరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు కొంగు బంగారంలా మారింది. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు అభ్యర్థుల ఎంపిక రేపు

మహేశ్వరం: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గురువారం ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ నర్సింహ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మండల కమిటీ, బ్యాంకు అధికారుల పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు (కులం, ఆదాయం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆన్‌లైన్ దరఖాస్తు పత్రం, మూడు పాస్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

చెక్కు అందజేత

పహాడీషరీఫ్: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా ఉంటుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన గుర్రం శివకుమార్ అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అయితే సీఎంఆర్‌ఎఫ్‌కు స్థానిక కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. మంత్రి సిఫారసుతో రూ.50 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును మంత్రి బాధితుడికి అందజేశారు.

వందల కోట్లతో జల్‌పల్లి అభివృద్ధి

మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: వందలాది కోట్ల రూపాయలతో జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో రూ.10.40 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మంచినీటి రిజ్వరాయర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి మంచినీరు అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ కల జల్‌పల్లి మున్సిపాలిటీలో త్వరలోనే నెరవేరనుందన్నారు. జీహెచ్‌ఎంసీ వెలుపల ఉన్న మున్సిపాలిటీలకు జలమండలికి రూ.1200 కేటాయించగా.. అందులో మహేశ్వరం నియోజకవర్గానికే రూ.210 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ నిధులతో రిజర్వాయర్లు, పైప్‌లైన్ల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. సీఎం ఆదేశాలతో జల్‌పల్లి మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులు చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలోని నోటరీ ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలని ఇప్పటికే కేసీఆర్‌ను కోరామని వెల్లడించారు. పహాడీషరీఫ్‌లోని పోలీస్ గ్రౌండ్‌లో రూ.5 కోట్లతో పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు స్థలం కోసం పోలీస్ కమిషనర్‌తో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. బాబా షర్ఫుద్దీన్ దర్గా ర్యాంప్ పనులు త్వరగా పూర్తయ్యేలా మరో రూ.5 కోట్లు మంజూరు చేయించామన్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులతో చర్చించి సమీకృత మార్కెట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కమిషనర్ వసంత, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ జీఎం గోవింద్ గౌడ్, నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, సయ్యద్ యూసుఫ్ పటేల్, కైసర్ బామ్, ఎక్బాల్ బిన్ ఖలీఫా, యంజాల అర్జున్, లక్ష్మీనారాయణ, శంకర్, ఎం.ఎ.హుస్సేన్ పాల్గొన్నారు.



ఎర్రకుంటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

బీజేపీకి అధికారం ఖాయం

కందుకూరు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైనా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వీరి సారథ్యంలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సొంత మండలానికి చెందిన కిషన్‌రెడ్డిని మరోసారి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ నియంతపాలనపై పోరాటం చేస్తున్న ఈటల మేధస్సు పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కొత్తగూడ సర్పంచ్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా నాయకులు సత్యనారాయణరెడ్డి, కె.జంగారెడ్డి, దిలీప్‌గౌడ్, కె.సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, బాలేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు

బడంగ్‌పేట్: ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొలన్ శంకర్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ఓడించి బీజేపీ అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు కేంద్రమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభలతో బీజేపీకి బలం పెరిగిందని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాలుగు పార్టీలు మారి కాంగ్రెస్‌కు ఎవరు లేకపోవడంతో అరువు తెచ్చుకున్నారని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ కోసం కేంద్ర మాజీమంత్రి సుష్మాస్వరాజ్ కృషి చేశారని కొనియాడారు. 1983, 2014 తెలంగాణ ఉద్యమానికి ప్రజలు ఎలా మద్దతు ఇచ్చారో.. నేడు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని శంకర్‌రెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

శిథిలావస్థకు అంగన్‌వాడీ కేంద్రం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో సిబ్బంది

కందుకూరు: మండలం కేంద్రంలోని యాదగిరిరెడ్డి నగర్ కాలనీలోని అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. నిర్వహణలోపం వల్ల పాములు, విష పురుగులకు ఆలవాలంగా మారింది. మరో పక్క గోడలు, స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. దీంతో అంగన్‌వాడీకి వస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. యాదగిరిరెడ్డినగర్ కాలనీలో 25 ఏళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరి గోడలు, స్లాబ్ పెచ్చులూడిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు.

పాము కలకలం

మంగళవారం మధ్యాహ్నం అంగన్‌వాడీ భవనంలో పాము కన్పించడంతో కలకలం రేగింది. అప్రమత్తమైన సిబ్బంది చిన్నారులను బయటికి పంపించి కాలనీ వాసులకు సమాచారం అందించారు. ఎట్టకేలకు పామును చంపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మత్తులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం

దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

పోల్కం బాలయ్య

మహేశ్వరం: దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో దొరల మెడలు వంచి పేదలకు భూములు పంచారని మహేశ్వరం పీఏసీఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య తెలిపారు. మహేశ్వరం కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య తన ప్రాణాలను తెగించి పోరాడారని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని బాలయ్య కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు బాలయ్య, ఒగ్గు శ్రీశైలం, మిదింటి బాల్‌రాజ్, రమేష్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి

కందుకూరు: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డీ నర్సింహాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమురయ్య విగ్రహానికి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అజీజ్, జగదీష్, రవీందర్, అనిల్, శివయాదవ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కందుకూరు: దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలలకు రూ.20 లక్షలు

కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ మేయర్

బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ కోసం బడంగ్‌పేట్ కార్పొరేషన్ రూ.20 లక్షలు కేటాయించింది. బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు శానిటరీ సిబ్బంది లేక దుర్వాసనలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరికొన్ని పాఠశాలల్లో నీటి సౌకర్యం కూడా లేదని పేర్కొన్నారు. జనరల్ ఫండ్ నుంచి రూ.20 లక్షలు నిధులు కేటాయించినందుకు కార్పొరేటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సౌకర్యాలు లేని స్కూళ్ల వివరాలను కార్పొరేషన్ డీఈ అశోక్‌రెడ్డికి అందచేశారు. వెంటనే పనులు మొదలుపెట్టాలని కోరారు. తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ఇబ్రాం శేఖర్ విజ్ఞప్తి చేశారు.



డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

సుందరీకరణ పనుల పరిశీలన

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో చేపట్టిన రోడ్ల సుందరీకరణ పనులను ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విజయ్, బ్యూటిఫికేషన్ కన్సల్టెంట్ పూజ పరిశీలించారు. అయితే బ్యూటిఫికేషన్‌తో రోడ్డు ఇరుకుగా మారుతుందని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు, సరూర్‌నగర్ ఆటో అసోషియేషన్ ప్రతినిధులు, హుడా టీ టైపు కాలనీవాసులు అభ్యంతరం తెలిపారు. ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ వింగ్ మాజీ అధ్యక్షులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఖిల్లా మైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు సునీల్ యాదవ్, మహేందర్, అరుణ్ కుమార్ ఉన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎస్సీ వర్గీకరణపై పార్టీల వైఖరి చెప్పాలి



నూతన అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేస్తున్న బాబు మాదిగ

రావుగళ్ల బాబు మాదిగ

మహేశ్వరం: ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజకీయ పార్టీలు తమ వైఖరిని తెలపాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ) పార్టీ జిల్లా ఇన్‌చార్జి రావుగళ్ల బాబు మాదిగ డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని, ఆ పార్టీ నేతలు మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. మాదిగలను బీజేపీ నమ్మించి మోసం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలకు మద్దతివ్వని పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని బాబు మాదిగ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా నాయకులు రవి మాదిగ, ఎర్ర నవీన్, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పిల్లల శేఖర్ మాదిగ, సీనియర్ నాయకులు, ఎర్ర వెంకటయ్య మాదిగ, రంజిత్ మాదిగ, మల్లేష్, కృష్ణ మాదిగ పలువురు పాల్గొన్నారు. అంతకుముందు సుభాన్‌పూర్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా విక్రమ్, ఎమ్మెస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎం.కృష్ణ , ప్రధాన కార్యదర్శులుగా శేఖర్ మాదిగ, శ్రీకాంత్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ జయశ్రీ

హుడాకాంప్లెక్స్: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని 133 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు తమ ఓటును వినియోగించుకోవడం కోసం పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ర్యాంపులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 80 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అధిక శాతం పోలింగ్ నమోదయ్యే విధంగా చూస్తామన్నారు. ఇళ్లు మారిన వారు తమ అడ్రస్ మార్చుకోవాలని సూచించారు. మృతి చెందిన వారు ఓటును తొలగించుకునేందుకు ఫారమ్ నెం-7తో పాటు మరణ ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సమన్వయంతో పనిచేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఇఇఎస్‌ఎల్ (వీధి దీపాల), విద్యుత్ అధికారులు, పురపాలక సంఘం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు వార్డుల్లో నెలకొన్న నీటి సమస్య, పైప్‌లైన్ మరమ్మతులు, వీధి దీపాల నిర్వాహణ, బోనాల పండుగ ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, డీఈ సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఇంజనీరింగ్ ఏఈ గుణాకర్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ వినయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఆర్‌ఐ బాల్‌రాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోశయ్య సేవలు చిరస్మరణీయం

ఆమనగల్లు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద మంగళవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాండురంగయ్య, యాదయ్య, డాక్టర్ శ్రీనివాస్, నర్సింహ, శ్రీధర్, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కట్టించి ఇవ్వాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ

కడ్తాల్: చల్లంపల్లి గ్రామంలో పేదల కోసం కేటాయించిన స్థలంలో వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో 2015 సంవత్సరంలో పేదలకు డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన స్థలాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. చల్లంపల్లి గ్రామంలో ఇళ్లస్థలాల కోసం 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం 7ఎకరాల భూమి కొనుగోలు చేసిందని.. ప్రతి ఎన్నికల సమయంలో ఇళ్లస్థలాలు పంచుతామని, ఇళ్లు కట్టించి ఇస్తామని హామీలు ఇస్తూ ఓట్లు వేయించుకుంటూ మోసం చస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్.. గ్రామంలోని ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీచ్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు తిరుపతిరెడ్డి, రమేశ్‌గౌడ్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

టీడీపీలోకి కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

మీర్‌పేట: కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ టీడీపీలో చేరారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో మల్లేష్ తన సహచరులతో కలిసి మంగళవారం టీడీపీలో చేరారు. మల్లేష్ వెంట రాష్ట్ర వంశరాజ్ కుల సంఘం అధ్యక్షులు గంధం సత్యనారాయణ, మీర్‌పేట బీజేవైఎం నాయకులు రాజేష్‌రెడ్డి, మీర్‌పేట మాజీ టీడీపీ అధ్యక్షుడు జానయ్య పటేల్‌తో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మల్లేష్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య, కార్య నిర్వాహక కార్యదర్శి భిక్షపతి ముదిరాజ్, చేవెళ్ల పార్లమెంటు అధ్యక్షులు సుభాష్ యాదవ్‌లు పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మల్లేష్

డివిజన్ అభివృద్ధికి కృషి: కార్పొరేటర్



జైశ్వాల్ కాలనీలో వేడుకల్లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

మీర్‌పేట: సీసీరోడ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తయిన సందర్భంగా సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తేనేటి విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జైశ్వాల్ కాలనీలో పరమాన్నం వండి కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం, ఆ అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత ప్రారంభోత్సవాలు జరుపుకోవడం సహజమన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో సకాలంలో సీసీ రోడ్ల పనులు పూర్తి చేసినందుకు సంబంధిత అధికారులు, కాలనీవాసులతో ఉత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. డివిజన్ ప్రజలు ఎదుర్కొనే సమస్యలు అన్నింటిని డిజిటలైజేషన్ చేశామని, పరిష్కారం అయ్యే వరకు ప్రజల వెంటే ఉంటానని తెలిపారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎల్‌బీనగర్: బీజేపీని బలోపేతం చేసి, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను అల్పకాలిక విస్తారక్ (తమిళనాడు) ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్ అన్నారు. బీజేపీ నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీని బలోపేతం చేసేందుకు తనను ఇక్కడికి పంపారని, బూత్ లెవల్‌లో పార్టీ బలంగా ఉందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల కోసం పార్టీని బలోపేతం చేసేందుకు ఈ ర్యాలీలు, బూత్ లెవల్ స్థాయి సమావేశాలు నిర్వహించామని తెలిపారు. అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు బీజేపీ వైపే ఉన్నారన్నారు. పార్టీ విజయానికి, పటిష్టతకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, రఘురాంనేత, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మెట్లుపల్లి సంతోష్‌రెడ్డి ,శంకరయ్య, శరత్, ఆదిలక్ష్మి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరించండి

అదనపు కలెక్టర్‌కు ఏబీవీపీ నాయకుల వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావ్‌ను ఏబీవీపీ నాయకులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు వివరించారు. ఆమనగల్లులో బీసీ హాస్టల్ ఎత్తివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆమనగల్లులో ఉన్న గురుకుల పాఠశాలను షాబాద్‌లో నిర్వహిస్తున్నారని తిరిగి ఆమనగల్లులోనే నిర్వహించాలని వారు కోరారు. బస్టాండ్ వద్ద ఉన్న ఉన్నత పాఠశాల కూలిపోయే స్థితిలో ఉందని.. వెంటనే నూతన భవనం నిర్మించాలని వారు కోరారు. నాలుగు మండలాలకు కూడలి అయిన ఆమనగల్లులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఏబీవీపీ నాయకులు భరత్, మల్లేశ్, విజయ్, చంటి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు